నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. ఐడీఏ మేడ్చల్, కండ్ల కోయ, సీమర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆలయ చైర్మన్‌కు ఆయన జన్మదినం సందర్భంగా స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త శ్రీహరి, మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



ఘట్‌కేసర్: సీఎంఆర్‌ఎఫ్ పేదల ఆరోగ్యానికి భరోసాను ఇస్తుందని కాంగ్రెస్ నేతలు అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అవుషాపూర్ గ్రామానికి చెందిన బిక్షపతికి మంజూరైన రూ. 60 వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరెడ్డి, సందీప్‌రెడ్డి, జంగయ్యముదిరాజ్ శనివారం అందజేశారు. సుధాకర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, చిన్నయాదవ్, నర్సింహ్మనాయక్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ నూతన కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డిని మున్సిపల్ కాంగ్రెస్ నేతలు కలిశారు. పట్టణంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించారు. మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి దంపతులు కమిషనర్‌ను కలిసి సన్మానించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

శామీర్‌పేట: రోడ్డు దాటుతున్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూంకుంట మున్సిపాలిటీ, అంతాయిపల్లికి చెందిన మంచాల కుమార్ (39), తూంకుటలో కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్‌రహదారి రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో (టీఎస్08యూఎల్ 9699) టిప్పర్ లారీ తూంకుంట నుంచి అల్వాల్ వైపు వెళ్తూ.. రోడ్డు దాటుతున్న కుమార్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపూర్ణ క్యాంటీన్ పేరు మార్పును వ్యతిరేకిస్తూ నిరసన

కాప్రా: అన్నపూర్ణ క్యాంటీన్ (రూ.5 రూపాయల భోజనం) పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్ పేరుగా మారుస్తూ.. తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్ ట్యాంక్‌బండ్ వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి కుమారస్వామి, షేర్ మణెమ్మ, బద్రుద్దీన్, బాలరాజ్, రహీమ, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం.. వ్యక్తిపై కేసు

మేడిపల్లి: మేడిపల్లి ప్రెస్‌క్లబ్ వ్యక్తులపై సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి ప్రెస్‌క్లబ్ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా నెట్‌వర్క్‌లో దుష్ప్రచారం చేస్తూ.. పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి స్పష్టం చేశారు.

ముందుకు సాగని చదువులు !

ప్రభుత్వ కళాశాలలో విద్య పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతోంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, పంచాయతీలు, పారిశ్రామిక ప్రాంతాలు, బస్తీల్లో నివసించే నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక.. హైస్కూల్, ఇంటర్ విద్యతోనే స్వస్తి చెప్పాల్సి వస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో

ప్రభుత్వ కాలేజీల్లో వసతుల కరువు

- బోధన, బోధనేతర సిబ్బంది కొరత
- అధ్వాన్నంగా తాగునీరు, శానిటేషన్
- హైస్కూల్, ఇంటర్ కాలేజీ భవనాల్లో షిఫ్టు సిస్టమ్‌లో డిగ్రీ కాలేజీల నిర్వహణ

40 శాతం విద్యార్థులు హైస్కూల్‌తోనే స్వస్తి..

జిల్లాలోని 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి ప్రతి ఏటా 8 వేలు, ప్రైవేట్ స్కూళ్ల నుంచి వేలాది మంది విద్యార్థులు పదోతరగతి పూర్తిచేసి, ఇంటర్ చదువులకు వెళ్లాల్సి ఉండగా.. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీలు లేకపోవటంతో 40 శాతం హైస్కూల్ చదువులతోనే విద్యార్థులు సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ ఇంటర్ పూర్తి చేసుకున్న కొద్దిమంది విద్యార్థులు కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారు.

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 4 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 2 ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు ఉండగా.. ఇందులో సుమారుగా 2,600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలోని 228 ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో రూ.1.13 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు.


◆ జిల్లాలోని మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అరకొర గదుల్లో విద్యార్థులు తమ చదువులను కొనసాగిస్తున్నారు. బొల్లారం, అల్వాల్‌ల్లో ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు గుడ్డిలో మెల్లిలా మనుగడ సాగిస్తున్నాయి.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా.. 11 మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేకపోవడంతో స్థానిక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

◆ శామీర్‌పేట, కీసర , ఘట్‌కేసర్, మేడిపల్లి, మూడు చింతలపల్లి, ఉప్పల్, కాప్రా, బాచుపల్లి, దుండిగల్, అల్వాల్, బాలానగర్ మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కొత్తగా ఏర్పాటు చేయాలన్న విద్యార్థి సంఘాల డిమాండ్ కార్యరూపం దాల్చడం లేదు.

పేదలపై ఆర్థికభారం..

మండలాల పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో చదువుకోవడం, ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల వైపు మొగ్గు



చూపుతున్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థికభారం పడుతోంది.

ఇంటర్ కాలేజీ భవనాల్లో డిగ్రీ తరగతులు

మేడ్చల్ జిల్లాలో 4 ప్రభుత్వ జూనియర్ కాలేజీల భవనాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, షిఫ్ట్ సిస్టమ్‌లో చాలీచాలని గదుల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో 5 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. ఉప్పల్‌లోని డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ భవనంలో కొనసాగుతోంది. మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో మధ్యాహ్నం షిఫ్టు పద్ధతిలో తరగతులను నిర్వహిస్తోంది. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ డిగ్రీ కాలేజీల్లో కూడా ఇదే తంతు కొనసాగుతోంది.

◆ 4 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మొత్తంగా 1040 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో జిల్లాలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం లభించకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కాలేజీలపై ఆధారపడుతున్నారు.

డిగ్రీ కాలేజీకి దశాబ్దకాలంగా పోరాటం..

మేడ్చల్ నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని దశాబ్దకాలంగా విద్యార్థి సంఘాలతో సహా విద్యార్థుల తల్లిదండ్రులు పోరాటం చేస్తున్నా.. ఇప్పటి వరకు మోక్షం లభించలేదు.

తాగునీటికి కటకట...

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పలు సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు లెక్చరర్లతో విద్యా సంవత్సరాన్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థులకు కాలేజీల్లో కనీసవసతులు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. తాగునీటికి విద్యార్థులు పడరాని పాట్లు పడాల్సివస్తోంది.

టాయిలెట్ల పరిస్థితి అంతే..

కళాశాలలో టాయిలెట్లు అధ్వానంగా తయారయ్యాయి. గంటల తరబడి వేచి ఉంటే తప్పా.. బాత్‌రూమ్‌లకు వెళ్ల లేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సదుపాయం కూడా సరిగ్గా లేదు.

బోధనేతల సిబ్బంది లేక..

ప్రభుత్వ కాలేజీల్లో బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో అక్కడ ఉన్న ఆధ్యాపకులే అన్ని విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పర్యవేక్షించాల్సిన అధికారులు.. అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి..

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల దుస్థితిపై ప్రభుత్వంతో సహా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజకీయ నాయకులు, పార్టీలు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల సమస్యలు తీర్చాలి



ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి. కనీస సౌకర్యాలతో పాటు అధ్యాపకులను నియమించాలి. కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి, భవన నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు సహకరించాలి

– కార్తిక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

హద్దులు నిర్ధారించమంటే.. క్రిమినల్ కేసు !

- రాంపల్లి దాయార రైతుల ఆవేదన
- రీ సర్వే చేయించాలని కలెక్టర్‌కు వినతి

సాక్షి,సిటీబ్యూరో: తమ పట్టా భూములు సర్వే చేసి నెలలు గడుస్తున్నా.. హద్దులు నిర్ణయించకుండా కాలయాపన చేస్తున్నారని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద బాధిత రైతులు సుధాకర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, దూసరి సత్యనారాయణ తదితరులు మీడియాతో మాట్లాడారు. కీసర మండలం రాంపల్లి దయార గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 617లో 10 మంది రైతులకు 13.02 ఎకరాల పట్టా భూమి ఉందని వారు పేర్కొన్నారు. దాని పక్కనే సర్వే నెంబర్ 618లో 20.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూములను సర్వే చేసి, రెండింటి మధ్య హద్దురాళ్లు పాతాలని 6 నెలలుగా రెవెన్యూ అధికారులను కోరుతున్నామన్నారు. దీనిలో భాగంగానే కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డిలతో పాటు, కలెక్టరేట్‌లో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఫిబ్రవరి13న సర్వే చేసి, హద్దులు నిర్ధారించారన్నారు. ఆ మరుసటి రోజే కీసర తహసీల్దార్ సర్వే సక్రమంగా జరగలేదని హద్దులను తొలగించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారన్నారు. అనంతరం కీసర ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ (డీఐ)తో మార్చి 18న మరోసారి సర్వే చేయించారన్నారు. మండల సర్వేయర్ చేసిన సర్వేతో డీఐ చేసిన సర్వే సరిపోవడంతో తక్షణమే డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారి రంగంలోకి దిగారన్నారు. ఆ వెంటనే సర్వే చేసిన సత్యమ్మను హద్దులు నిర్ధారించకుండానే వెనక్కి రావాలని ఫోన్‌లో ఆదేశించడంతో ఆమె వెనుదిరిగివెళ్లారని,



బాధిత రైతులు వాపోయారు. హద్దుల నిర్ధారణ కోసం నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటి వరకు కలెక్టరేట్ ప్రజావాణిలో 10 సార్లు ఫిర్యాదు చేసినా.. సంబంధిత అధికారులు స్పందించడం లేదన్నారు.

సర్వేయర్ చూపించిన చోటే..

మండల సర్వేయర్ సునీత చూపించిన చోట మే 5న రైతులు హద్దురాళ్లను పాతుతుండగా.. తహసీల్దార్ అశోక్కుమార్ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారంటూ.. రైతు కంసాని సుధాకర్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గత 4 నెలలుగా హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. స్పందించని అధికారులు పోలీస్‌స్టేషన్‌లో మాత్రం అగమేఘాలపై క్రిమినల్ కేసు పెట్టించారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రాంపల్లి దాయార రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 618లోని ప్రభుత్వ భూమి, సర్వే నెంబర్‌లోని 617లోని రైతుల పట్టా భూముల మధ్య పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, హద్దులు ఖరారు చేయాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కీసర: కీసరలోని కేసరి ఆసుపత్రి, నాగారంలో రెండు క్లినిక్‌లను శనివారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్, ఎంటీపీ యాక్ట్ ఉల్లంఘిస్తూ.. నడుపుతున్న ఆసుపత్రులు, క్లినిక్స్, డయగ్నస్టిక్ సెంటర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆస్పత్రిని తనిఖీ చేయగా.. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం



కేసరి ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ఉమాగౌరీ

అనేక నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయని, దీనిపై నోటీసులు జారీ చేశామన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

మేడ్చల్ రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీయాలని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థుల సృజనాత్మకతకు ప్రోత్సాహం కల్పిస్తూ.. »ప్రకల్ప్ ప్రదర్శన« పేరిట ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. 250 జట్లు తమ ప్రాజెక్ట్‌లను పోటీకి సమర్పించగా.. పరిశీలన అనంతరం 80 జట్లను ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఉత్తమ ప్రదర్శన చూపిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్


సీఎంఆర్‌టీసీలో విద్యార్థుల ప్రదర్శనలు

నారాయణ, ప్రిన్సిపాల్ శేషు, డీన్ దేవదాస్, సురేశ్‌రామ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాప్రా ఎక్సైజ్‌స్టేషన్ ప్రారంభం వాయిదా

పోచారం: నారపల్లిలోని మందడి సురేందర్‌రెడ్డి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాప్రా ఎక్సైజ్‌స్టేషన్ ప్రారంభం వాయిదా పడింది. ఘట్‌కేసర్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని కొంత భాగాన్ని వేరుచేసి కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌కు రూపకల్పన చేశారు. శనివారం జరగాల్సిన ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఘట్‌కేసర్ స్టేషన్‌లోనే కాప్రా స్టేషన్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసి కాప్రా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవికి బాధ్యతలు అప్పగించనున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట: మూడు చింతలపల్లిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన అఫ్సర్(40) మూడు చింతలపల్లిలో అద్దెకు నివాసం ఉంటూ పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు . మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఘనంగా పీవీ జయంతి

మేడ్చల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద పీవీ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, రవిముదిరాజ్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుకు వచ్చే చెత్తను తగ్గించాలి


లారీలను నిలిపేసి నిరసన చేస్తున్న జేఏసీ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ యాంటీ డంపింగ్ యార్డు జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం డంపింగ్‌యార్డు సమీపంలో చెత్త లారీలను నిలిపేసి భారీ ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. 'రాంకీ యాజమాన్యం నింబంధనలు తుంగలో తొక్కుతూ.. ప్రజల జీవితాలతో ఆటలాడుతుందని' ఆరోపించారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు చెత్తను తగ్గిస్తామంటే రోజురోజుకు పెంచుతున్నారని, వెంటనే జవహర్‌నగర్‌కు వచ్చే చెత్తను తగ్గించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్‌జీటీ కోర్టులో విచారణ జరుగుతుందని, ఆగస్టు 6న తీర్పు వెలువడనుందని, డంపింగ్‌యార్డు ప్రాంతంలోని బాధితులు శాంతియుతంగా నిరసన తెలిపి కోర్టు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. భారీ పొడవునా చెత్త లారీలు నిలిచిపోయాయి. అనంతరం జవహర్‌నగర్ పోలీసులు జేఏసీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జేఏసీ నాయకులు స్వామిరెడ్డి, శంకర్‌నారాయణ, సంజీవరెడ్డి, స్వర్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించండి

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కోరారు. శనివారం ఆమె మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కుషాయిగూడలో పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా అరెకరం స్థలంలో కల్యాణ మండపం నిర్మించి, ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.


మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

రైల్వే వంతెన పనులు పూర్తి చేయించాలి


కమిషనర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పంజాల రాజేష్‌ను పలువురు రైల్వే వంతెన జేఏసీ నాయకులు ఆయన కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు పూర్తి చేయించి, జిల్లా బస్సుల రాకపోకలకు సహకరించాలని కోరారు. నగేష్‌కుమార్‌గుప్తా, జంగయ్య, సిరాజ్ పాల్గొన్నారు.

మజీద్‌పూర్‌లో కమిషనర్ పర్యటన

శామీర్‌పేట: అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ మున్సిపల్ అధికారులతో కలిసి మజీద్‌పూర్‌లో పర్యటించారు. 100 రోజుల ప్రణాళిక అమలులో భాగంగా మజీద్‌పూర్ ప్రజయ్‌హోమ్స్‌లో పర్యటించి తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించి వివిధ అంశాలను పరిశీలించారు. కాలనీవాసులు లక్ష్మారెడ్డి, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్

కనీస వైద్య సేవలేవీ ?

- సమయానికి రాని డాక్టర్లు, సిబ్బందితో తప్పని తిప్పలు
- ఆసుపత్రుల స్థాయి పెంచినా.. వసతులు కరువు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లాలో నగరీకరణకు అనుగుణంగా ఆసుపత్రుల్లో మంజూరు పోస్టులను కూడా భర్తీ చేయకపోవటంతో ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోంది. సీహెచ్‌సీలు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలతో సహా బస్తీ, పల్లె దవాఖానాల్లో ఖాళీగా 15 వైద్యులు పోస్టులతో సహా పారా మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్‌స్టాఫ్ , నర్సులు పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరముంది. జిల్లాలో 3000 మంది ఆశావర్కర్లు పనిచేయాల్సి ఉండగా.. 340 మంది మాత్రమే ఉన్నారు.

నియామకాల్లో జాప్యం..

అప్‌గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాప్ నర్సులు, 10 పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరుగుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టిసారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

24 గంటలు ఆసుపత్రుల్లో..

జిల్లాలో 24 గంటలు ఆసుపత్రులు 12 ఉండగా.. ఇందులో 4 ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిలో ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పనితీరు మెరుగుపై..

మేడ్చల్, ఘట్‌కేసర్ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి రాక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో సహా పల్లె, బస్తీ దవాఖానాల్లో కూడా వేళకు రాని వైద్యులు,



సిబ్బందితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా.. 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నారు. డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

◆ 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలుండగా.. 6 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నామని, జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నారు. ఈ ఆసుపత్రుల్లో మిగతా సేవలు కూడా అంతంతమాత్రంగా అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైద్య సేవలే లక్ష్యంగా..

ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జిల్లా కేంద్ర, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు తోడుగా కొత్తగా బస్తీ, పల్లె సబ్‌సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ, సంబంధిత వైద్యాధికారుల నిర్లక్ష్యం, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని వైఖరితో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది.

◆ జిల్లాలో 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు. 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు స్థానిక ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి.

సమయ పాలనపై దృష్టేదీ.. ?

జిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లో సమయానికి రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులు వైద్య పరీక్షలు, సేవల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సీజనల్ వ్యాధులకు సరైన మందులు లభించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

అల్వాల్: ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ వెస్ట్ కృష్ణనగర్‌లో నివసించే భరత్‌కుమార్, భార్గవి (30)లకు 2024లో పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం జరిగింది. భరత్‌కుమార్ చేసిన అప్పుల విషయంలో బార్యభర్తల మధ్య గొడవ జరుగుతుండేది. ఈనెల 27న ఇంట్లో గొడవ జరగడంతో భర్త ఇంటి బయట పడుకోగా.. భార్య ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. 28న ఉదయం లేచిన అతడు డోర్ కొట్టగా.. ఆమె స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.